

## పొద్దు పొడుపు.. బొజ్జన్న అడుగు

■ ఉట్నూర్‌లో మార్నింగ్ వాక్ చేస్తూ పలు కాలనీల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పర్యటన


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 12 నవంబర్ 2025 | ■ 13 పేజీలు




## తేమ తాకట్లు.. పత్తి రైతు కుదేలు

# సీసీఐ.. అంతే..!

■ ప్రైవేటు వైపే పత్తి రైతుల మొగ్గు..

■ కర్షకులపై కత్తికట్టిన వాతావరణం?

■ పత్తి విక్రయాలపై ప్రభావం ■ పడిపోతున్న ధరలతో ఆందోళన

■ సీసీఐ నిబంధనలకు దూరంగా తేమ శాతం

■ 8-12 శాతానికి మించి 13-20 మధ్య నమోదు

■ అదే సాకుతో కొనుగోళ్లకు సీసీఐ నిరాకరణ

■ ఇదే అదనుగా వ్యాపారులు అడ్డగోలుగా నిర్ణయం..

■ పెట్టుబడి వచ్చేలా లేదని ఆవేదన

ఒకపక్క వాతావరణం.. మరోపక్క సీసీఐ నిబంధనలు పత్తి రైతుల కుత్తుకల మీద కత్తిలా మారాయి. కాలం కలిసి రాకున్నా.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు అప్పో సప్పో చేసి.. పత్తి పండించిన రైతులకు తీరా సరుకు అమ్మబోతే తలలు పట్టుకునే పరిస్థితులు దాపురించాయి. గిట్టుబాటు ధర పలకక పెట్టిన పెట్టుబడులు కూడా రావేమోననే ఆవేదనలో కుంగిపోతున్నారు. మార్కెట్‌లో ధరలు చూసి ఆందోళనలు చేపట్టినా ఆదుకునేవారు లేక ఆందోళనలో 'మునిగి'పోతున్నారు.

కనీసం ఎమ్మెస్పీ ధర కూడా దక్కే దిక్కులేక అయోమయానికి గురవుతున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు సాధారణం కంటే ఎక్కువగా పడ్డాయి. కాలం కకావికలం చేసినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా పత్తి సాగు చేశారు. ఎండలు, వానల నుంచి పంటలను సంరక్షించుకుని పండించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈసారి గతంతో పోలిస్తే పత్తి పంట భారీగానే దిగుబడి వచ్చింది. సీసీఐ మద్దతు ధర 8,110 రూపాయలతో కొనుగోలు చేస్తుంటే... ప్రైవేటు వ్యాపారులు 200 రూపాయల తక్కువతో కొనుగోలు చేస్తున్నారు. ఇక పత్తిలో తేమ పేరుతో 7 వేలలోపే ధరతో ఉంటున్న ఆరోపణలు ఉన్నాయి. అధికార యంత్రాంగం ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

10



## ఫాస్టాగ్ చెక్‌పోస్ట్‌పై భగ్గుమన్న ఎమ్మెల్యే

■ కొత్తగూడ చెక్ పోస్ట్ వద్ద అటవీ శాఖ అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే..

■ తనకు తెలియకుండా ఎలా ప్రారంభిస్తారని ఆగ్రహం ■ 24 గంటల్లో బంద్ చేయాలి

■ లోకల్ వాహనాలకు డబ్బులు వసూలు చేస్తే ఊరుకొనేది లేదు

■ లోకల్ వాహనాల డాటా సేకరించిన తరువాతనే ఫాస్ట్యాగ్‌పై నిర్ణయం తీసుకోవాలి

■ అటవీ శాఖ తీరును తప్పు పట్టిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

కవ్వాల టైగర్ జోన్ పరిధిలోని చెక్ పోస్టుల వద్ద రాకపోకలు సాగించే వాహనాల నుంచి రుసుం వసూలు చేసేందుకు ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ కేంద్రాలపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ భగ్గుమన్నారు. అటవీ శాఖ తీరును తప్పుబట్టారు. తన అనుమతి లేకుండా ఫాస్టాగ్ ఎలా ప్రారంభిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో బంద్ చేయాలని ఆదేశించారు.





### ప్రభాత సమాచారం ఎడిటర్

## సయ్యద్ కరీంను సన్మానించిన జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)

ప్రభాత సమాచారం దినపత్రిక ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ కరీంను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సన్మానించారు. మంగళ వారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం కార్యక్రమంలో జిల్లాలో సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఐదుగురు సీనియర్ జర్నలిస్టులను, ఐదుగురు కవులను సత్కరించారు. ప్రభాత సమాచారం దినపత్రిక ఎడిటర్‌గా పని చేస్తున్న సయ్యద్ కరీం గత నాలుగు దశబ్దాలుగా జిల్లాలో జర్నలిస్టుగా పని చేస్తున్నారు. ఆంధ్రజ్యోతి, సూర్య, ఆంధ్రప్రభ దిన పత్రికల్లో ఉమ్మడి జిల్లా బ్యూరో చీఫ్‌గా పని చేసిన అయన అనేక విశ్లేషణాత్మకమైన కథ నాలు రాసి వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు చూపారు. అయన రాసిన అనేక కథనాలు అసెంబ్లీలోనూ చర్చకు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలోనే అత్యంత సీనియర్ జర్నలిస్టుగా పేరూపొందిన ఉట్నూర్‌కు చెందిన సయ్యద్ కరీంను విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా సన్మానించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

**సయ్యద్ కరీంను సన్మానించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్...**

విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ 'ప్రభాత సమాచారం' తెలుగు దినపత్రిక ఎడిటర్ సయ్యద్ కరీంను మంగళవారం రాత్రి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శాలువతో సన్మానించి అభినందించారు.



### ఉమ్మడి జిల్లాలో..

## పెరిగిన చలి తీవ్రత

■ ఏజెన్సీని వణికిస్తున్న చలి

■ రెండు రోజులుగా మరింత తీవ్రం

■ లింగాపూర్‌లో 8.7 కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

### గుండెపోటుతో

## యువ వైద్యుడు మృతి

■ ఒక్కసారిగా కుప్పకూలిన రిమ్స్ సీఎంఓ నగేష్

■ యువవైద్యుడి మృతితో రిమ్స్‌లో విషాద ఛాయలు

■ దిగ్బ్రాంతికి గురైన రిమ్స్ సంచాలకులు జైసింగ్..





### విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన

# దార్శనికుడు అబుల్ కలాం ఆజాద్

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రిగా దేశంలో ఆధునిక విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన దార్శనికుడు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మైనారిటీల విద్యా అభివృద్ధి, సంక్షేమం కోసం విశేష కృషి చేసిన ఆదర్శమూర్తి మౌలానా ఆజాద్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం పెంపు కోసం ఎఫ్.ఆర్.ఎస్ అటెండెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం విద్యార్థుల హాజరు



శాతం, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని అన్నారు. పేద కుటుంబాల విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన సహకారం స్వచ్ఛంద సంస్థల ద్వారా అందించేలా చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడు మొహమ్మద్ అథర్ ఉల్లా మాట్లాడుతూ, చదువుతోనే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమని, తల్లిదండ్రులు విద్యార్థుల చదువు పట్ల శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా విద్యా రంగంలో సాధించిన విజయాలు రాష్ట్రానికే కాకుండా దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అనంతరం పలువురు కవులు, మీడియా ప్రతినిధులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మైనార్టీ సంక్షేమ అధికారి ఖలీం, ఇతర అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**లక్షెట్టిపేట, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం మోదెల, ఇటిక్యాల, గంపలపల్లి గ్రామాలలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 150, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 97, డి.సిఎంఎస్. ఆధ్వర్యంలో 63, మెప్మా ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పా



టు చేయడం జరిగిందని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా నిర్ణయించడం జరిగింది, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలకు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలను వేరువేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యం కోసం త్రాగునీరు, నీడ వసతి కల్పించడంతో పాటు గోనె సంచులు, తేమ యంత్రాలు, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు ఇతర సౌకర్యాలు సమకూర్చడంతో పాటు ధాన్యం విక్రయించిన రైతులకు త్వరగా చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, ధాన్యం అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్టుల వద్ద చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



### భూమిని విరాళంగా అందించిన

## దాతలను సన్మానించిన కలెక్టర్

**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

సాత్నాల మండలం దుబ్బగూడ గ్రామానికి చెందిన ఆత్రం లేతు బాయి భర్త జంగు, సామాజిక సేవా స్ఫూర్తితో, తన 3 ఎకరాల భూమి (సర్వే నం. 18/2/10)లోని ఒక ఎకరం భూమిని 10 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం కోసం స్వచ్ఛందంగా విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంలో మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆత్రం లేతు బాయి దంపతులను శాలువా తో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఇలాంటి స్వచ్ఛంద సహకారాలు సమాజ అభ్యున్నతి కోసం గొప్ప ఉదాహరణలని, ప్రజల సహకారంతో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగంగా ముందుకు సాగుతా యని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, తహసిల్దార్ రామారావు పాల్గొన్నారు.

## అయోమయంలో డిగ్రీ విద్యార్థులు

**ఉట్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి, మూడో, ఐదోవ సెమిస్టర్ పరీక్ష తేదీలను యూనివర్సిటీ అధికారులు మంగళవారం ప్రకటించారు. అయితే ఈనెల 18వ తేదీ నుంచి డిగ్రీ పరీక్షలను విద్యార్థులను రాయనున్నారు. అయితే పిఫ్త్ సెమిస్టర్ పరీక్షలైన పొలిటికల్ సైన్స్ గ్రూప్ (ఓల్డ్) పరీక్ష తేదీని ఏకంగా 15.12. 2028 తేదీగా ప్రకటించారు. దీంతో ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులు ఆయోమయానికి గురవుతున్నారు. పరీక్ష రాయాలంటే మూడు సంవత్సరాల ఆగాల్సిందేనా..? అంటూ వాట్సాప్ గ్రూప్‌లలో పోస్టులు పెడుతున్నారు. కాకతీయ యూనివర్సిటీ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని పలువురు విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఉరికొయ్యలా స్లాట్ బుకింగ్

### మాజీ మంత్రి జోగు రామన్న

**జైనథ్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రైతు హైదవ్ దీపక్ ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటనలో నిలువ చేసుకున్న పత్తి పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగురామన్న మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి రైతు కుటుంబాన్ని పరామర్శించారు. కన్నీటి పర్యంతమైన ఆ రైతుని పరామర్శించి ఆవేదన వ్యక్తం చేశారు. స్లాట్ బుకింగ్ కోసం ఎదురు చూస్తూ వారం రోజులుగా పత్తి ఇంట్లోనే నిలువ ఉంచుకోవాల్సి రావడంతో ఈ పరిస్థితి వచ్చిందని రైతు వాపోయారు. రైతుకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మంచిర్యాల మండల అధికారి శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, వయోవృద్ధులతో కలిసి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం- 2025 సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో "వయోవృద్ధులు ప్రపంచ కార్యచరణను నడిపించే మార్గదర్శకులు: మన ఆంక్షలు, మన శ్రేయస్సు, మన హక్కులు" నినాదంతో వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 12వ తేదీన వారోత్సవాల ప్రారంభం, 13న ఆటపాటలు, వినోద కార్యక్రమాలు, 14న ఉచిత ఆరోగ్య శిబిరాలు, 15న



వయోవృద్ధుల హక్కులపై అవగాహన ర్యాలీ, 17న జిల్లా స్థాయిలో వృద్ధుల చట్టాలు, ఆరోగ్యం, చురుకైన వృద్ధాప్యంపై అవగాహన కార్యక్రమం, 18న గ్రామస్థాయిలో సర్పంచ్, ఇతర ప్రతినిధుల అవగాహన కార్యక్రమాలు, 19న రాష్ట్ర, జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వృద్ధులు తమ పోషణ, ఇతర ఫిర్యాదుల కొరకు ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ 14567 నంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో తలపెట్టిన వారోత్సవాలను అధికారులు సమన్వయంతో కృషి చేసి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వృద్ధులు పాల్గొన్నారు.



## విద్యార్థులు చదువుతో పాటు

# క్రీడల్లోనూ రాణించాలి

### జిల్లాస్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**లక్షెట్టిపేట, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)** విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాల మైదానంలో నిర్వహించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ జిల్లాస్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో రాణిస్తూ సామాజిక దృక్పథం కలిగి ఉండాలని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని, స్నేహభావం పెంపొందుతుందని, నాయకత్వ లక్షణాలు అలవడతాయని తెలిపారు. క్రీడలతో చదువులో ఏకాగ్రత పెరుగుతుందని, ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి



నాణ్యమైన విద్యను అందిస్తుందని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 2025-26 మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడంతో విద్యార్థులు పోటీలలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారని అభినందించారు. ఈ పోటీలలో జిల్లాలోని గుడిపేట బాలుర జట్టు మొదటి బహుమతి, నిర్మల్ జిల్లా బాలుర జట్టు ద్వితీయ బహుమతి గెలుపొందారని తెలిపారు. విద్యార్థులు చదువులో సైతం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

### ఏరియా జీఎంఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)** యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జీఎం ఎన్. రాధాకృష్ణ తెలిపారు. మందమర్రి ఏరియా సిఈఆర్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన మిషన్ హెల్తీ సింగరేణి, ప్రాచీన యోగ దినచర్య, 15 సంవత్సరాల శాస్త్రీయ పరిశోధన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఆదేశాల మేరకు మిషన్ హెల్తీ సింగరేణి కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగిందన్నారు .ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే తన యొక్క కుటుంబం బాగుంటుందని, కుటుంబం బాగున్నప్పుడే సమాజం బాగుంటుందని తద్వారా, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరం కృషి చేసిన వాళ్ళం అవుతామని వారు అన్నారు. శారీరక శ్రమ, ఆటలతో పాటు యోగాను కూడా జీవితంలో ఒక భాగంగా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షణ్ముక, జీఎం లలిత్ ప్రసాద్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, టీ. శ్రీధర్, జీవీటీసీ మేనేజర్, జీవీటీసీ శిక్షకులు అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి పాల్గొన్నారు.

# ధర్నా పేరుతో.. బీజేపీ నేతల డ్రామాలు

### డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ధ్వజం

**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)** మూడు సార్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి.. ధర్నా చేయడం సిగ్గు చేటని కాంగ్రెస్ నాయకులు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తిచేయలేదని ధర్నా చేసిన బీజేపీ నాయకులు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండగా.. ఇక్కడి ఎంపీ,ఎమ్మెల్యేలు సీసీఐతో మాట్లాడి ఎందుకు రైతుల సమస్యలు పరిష్కరించడంలేదని అన్నారు. తేమ శాతంతో పంట అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే, ఎంపీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం కోసం



పనిచేస్తున్న ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు సరికావన్నారు. మొన్నటి బీఆర్ఎస్ నాయకులు ఎంపీ ఇంటి ముట్టడి సరికాదన్నారు. మరి ఎమ్మెల్యే ఇంటి ముట్టడి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దీంతో జోగు రామన్న పాయల్ శంకర్ ఒక్కటే అన్నది రుజువవుతందన్నారు. జూబ్లిహిల్స్ ఫలితాలతో బీఆర్ఎస్ బీజేపీల బలమెంతో తేలిపోతుందన్నారు. సమావేశంలో నాయకులు నర్సింగ్, లోకప్రవీణ్ రెడ్డి, శ్రీలేఖ పాల్గొన్నారు.

# తిర్యాణిలో చిరుత పులి కలకలం



**తిర్యాణి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)** తిర్యాణి మండలంలో చిరుత పులి సంచారం కలకలం రేపుతోంది. గడిచిన రెండు రోజుల వ్యవధిలో రెండు చోట్ల దాడి చేసి మూడు పశువులను హతమార్చింది. తిర్యాణి మండలంలోని దేవాయిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని తోయగూడెం గ్రామానికి చెందిన మాడావి సోముకు చెందిన రెండు ఆవుల పై చిరుత పులి దాడి ఆదివారం హతమార్చగా తాజాగా మంగళవారం కైరిగూడ గ్రామానికి చెందిన ఊరడీ ధర్మయ్యకు చెందిన ఆవు దూడ మేతకు వెళ్లగా సాయంత్రం తిరిగి వస్తుండగా చిరుతపులి దాడి చేసి హతమార్చినట్లు స్థానిక రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు మాత్రం ఇప్పటి వరకు ఏం నిర్ధారించలేదు. మరోవైపు చిరుత పులి సంచారంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు.

# మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దు

### లోకేశ్వరం ఎస్సై అశోక్



**లోకేశ్వరం, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పసారిగా ధరించాలని లోకేశ్వరం ఎస్సై జి.అశోక్ అన్నారు. మంగళ వారం ఒక ప్రకటన విడు దల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతిరోజు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృశ్య హెల్మెట్ ధరించినట్లయితే ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. ఇటీవలే జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు వల్ల కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నట్లు పేర్కొన్నారు. అతివేగంతో వాహనాలను నడపకూడదని దానివల్ల జరిగే పరిణామాలు తీరని లోట అన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు.మద్యం సేవించి వాహనాలను నడపకూడదని సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలో

# క్రీడల పట్ల ఆసక్తి పెంచాలి

**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)** టిజిపేట ఆధ్వర్యంలో ఈరోజు గౌరవ నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్నని మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలని సూచించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పైన డీఈఓతో మాట్లాడడం జరిగింది కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఇందులో టిజిపేట అధ్యక్షులు నరాల సత్తయ్య, కార్యదర్శి వన్నెల భూమన్న, కోశాధికారి నచ్చేందర్, భూక్య రమేష్ భోజన్న ఎస్టియు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ వ్యాయామ ఉపాధ్యాయులు వంశీ సంధ్య సంజీవ్ బుచ్చి రామారావు పాల్గొన్నారు. డీఈఓ సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.



# మౌలానా అబుల్ కలాం సేవలు మరువలేనివి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)** భారత తొలి విద్యాశాఖ మంత్రిగా వినూత్న సంస్కరణలతో విద్యా రంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎనలేని కృషి చేశారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి లతో కలిసి హాజరై ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించారని, భారత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి విద్యారంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి బలమైన పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కుతుందన్నారు. ఆజాద్ హయాంలో విశ్వవి ద్యాలయాలు ఏర్పాటు అయ్యాయని, బాలిక విద్యను ప్రోత్స హించారని



తెలిపారు. చదువు ప్రాముఖ్యతను తెలుపుతూ తన రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం, విద్యార్థులు ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**తాంసి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం పర్యటించారు. గ్రామానికి వచ్చి ఆయనకు అధికారులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇటీవల అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదాలను ఎస్పీకి వివరించారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఎస్పీకి విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఆర్అండ్‌బి, రెవెన్యూ, పంచాయతీరాజ్, నేషనల్ హైవే అథారిటీ, కాంట్రాక్టర్స్‌తో పాటుగా పోలీసు అధికారులతో ప్రమాదాల స్థలాలను పరిశీలించి సిబ్బందికి, అధికారులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను



సూచించారు. తాంసి, తలమడుగు మండలాలలోని పొన్నారి, హస్నపూర్, సుంకిడి అంతరరాష్ట రోడ్డుపై ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను సదర్శించడం, అదే విధంగా ఆదిలాబాద్ రూరల్ పరిధిలో ఉన్న ప్రదేశాలను సందర్శించడం జరిగింది. అదేవిధంగా గతంలో జరిగిన ప్రమాదాలను విశ్లేషించి ఇకముందు ప్రమాదాలు జరగకుండా చర్యల చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా రహదారుల వెంట ఉన్న గ్రామాలకు సరి వెళ్లే రోడ్ల నందు స్పీడ్ బ్రేకర్లను చేయాలని, అవసరమైన ప్రదేశాలలో రంబుల్ స్టెప్స్ ఏర్పాటు చేయాలని, నిర్మాణ ప్రదేశాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, రాత్రి సమయాలలో కనిపించే విధంగా రేడియంతో స్టిక్కర్లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరగకుండాత నివారించవచ్చున్నారు. రాత్రి గ్రామాలు, పట్టణాల్లోని జాతీయ రహదారులలో లైట్లను ఏర్పాటే చేయలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ కె ఫణిదర్, ఎస్ఐలు రాధిక, జీవన్ రెడ్డి, విష్ణువర్ధన్, తహసీల్దార్ లక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ రేఖ రఘు, మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ రమణ ఉన్నారు.



## శాంతిఖని ఆలయ వార్షికోత్సవం

### ప్రత్యేక పూజలు చేసిన జీఎం రాధాకృష్ణ

**బెల్లంపల్లి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శాంతిఖని ప్రాజెక్టులోని దుర్గామాత దేవాలయం ఐదవ వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజ, హోమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మందమర్రి జీఎం ఎన్ రాధ కృష్ణ, ఎస్సీ ఎస్టీ రాష్ట్ర కమిషన్ సభ్యుడు రేణీకుంట్ల ప్రవీణ్ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథులు వచ్చిన జీఎం రాధాకృష్ణ, ఎస్సిఎస్టీ కమిషన్ సభ్యుడు రేణీకుంట్ల ప్రవీణ్ లను అధికారులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంల ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్వో టూ జీఎం ప్రసాద్, ఎస్కే గ్రూపు ఏజెంట్ అబ్దుల్ ఖాదిర్, మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, గని సేఫ్టీ ఆఫీసర్ రాజు, బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి డివైసీఎం పాండురంగా చారి, శాంతిఖని వెల్ఫర్ ఆఫీసర్ రవికుమార్, శాంతిఖని ఆలయ కమిటీ సభ్యులు, శాంతిఖని, జీఎం కార్యాలయం అధికారులు, అన్ని యూనియన్ల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

## వేగవంతం చేయాలి

**ఖానాపూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ మండలంలో పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని ఎంపీడీవో రమాకాంత్ సూచించారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని దాసు నాయక్ తండా, పంగిడిగూడెం, రాజుర, సింగాపూర్, బాదనకుర్తి, తదితర గ్రామాలను సందర్శించి ఇండ్ల నిర్మాణాల పనులను పరిశీలించారు. నిర్మాణం పనులలో అలసత్వం వద్దని ప్రభుత్వం వెంటనే బిల్లులు ఇస్తున్నందున పనులలో వేగం పెంచాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ, సిహెచ్ రత్నాకర్ రావు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

### అంగన్వాడీలను నిర్వీర్యం చేసేందుకు

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర

**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

దేశంలో పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్న అంగన్వాడీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభలకు హాజరయ్యారు. అంగన్వాడీలు ఎదుర్కొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకొస్తున్న వాటిని పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వేతనాలు పెంచాలని ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు రాములు జిల్లా నాయకులు సురేష్ జిల్లా అధ్యక్షురాలు గంగామణి అంగన్వాడీలు పాల్గొన్నారు.



### 23న ధర్మ యుద్ధం బహిరంగ సభను

## విజయవంతం చేయాలి



**నార్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**


ఈనెల 23న ఉట్నూరులో నిర్వహించనున్న ధర్మ యుద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు దాది రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టబద్ధత లేని లంబాడలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఏకైక డిమాండ్‌తోనే ఈనెల 23న బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభను విజయవంతం చేసేందుకు ఆదివాసి 9 తెగలకు చెందిన అనుబంధ సంఘాల నాయకులు, మేధావులు, ఉద్యోగస్తులు, యువత పెద్ద సంఖ్యలో తల్లి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు మెస్రం మాణిక్ రావు, విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు కనక హన్మంతరావు, ప్రచార కార్యదర్శి క్రిష్ణ, లక్ష్మణ్, జైవంత్ రావ్, సంజీవ్ తదితరులున్నారు.

### రహదారుల నిర్మాణానికి

## నిధులు మంజూరు చేయాలి

**ముథోల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

ముథోల్ నియోజకవర్గంలో ఆయా గ్రామాలకు రోడ్లు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని హైదరాబాద్‌లో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ముథోల్ నియోజకవర్గంలో వానల్ పాడ్ నుండి వంజార, సోనారి నుండి కుభీర్, మలేగావ్ నుండి వర్ని రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా గుంతలమయమయ్యానని ఆయన మంత్రికి వివరించారు. నూతన రోడ్లతో పాటు, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. గతంలో నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన మంత్రికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. సతీష్ రెడ్డి, గంగాధర్ ఉన్నారు.





### సుదర్శన్ రెడ్డిని కలిసిన

## ఉమ్మడి జిల్లా నాయకులు

**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా బాధ్యతలు చేపట్టిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని మంగళవారం మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అభినందించారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి రాథోడ్ బాపూరావు డైయిరీ ఫారం మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, సీనియర్ నాయకులు శ్యామ్ నాయక్ తదితరులు ఉన్నారు.


## ప్రజల గొంతుకగా అందెశ్రీ

### ఆయన మరణం.. సాహితీ రంగానికి తీరని లోటు

### తెలంగాణ తల్లి విగ్రహ రూపశిల్పి బైరోజు

**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

ప్రజల గొంతుకగా నిలిచిన అందెశ్రీ మరణం.. సాంస్కృతిక, మేధో ప్రపంచానికి తీరని లోటని తెలంగాణ తల్లి విగ్రహ రూపశిల్పి బైరోజు వెంకట రమణాచారి అన్నారు. అందెశ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయని, గొప్ప కవి, మేధావి అయిన అందెశ్రీ ప్రజల పోరాటాలకు, ఆకాంక్షలకు, అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారని ఆయన అన్నారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, ప్రజల సాంఘిక హృదయ స్పందనకు రూపం ఇచ్చే శక్తి ఉందన్నారు. సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో ఆయన మిళితం చేసిన విధానం అద్వితీయమన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటే గొప్ప గేయాన్ని రచించిన కవి రచయిత అందెశ్రీ మన నుండి దూరమైనప్పటికీ ఆయన అందరి గుండెల్లో నిలిచి ఉన్నారని అందెశ్రీ మరణం తెలంగాణ సాహిత్యానికి తీరనిలోటన్నారు. తాను తెలంగాణ తల్లి విగ్రహం రూప శిల్పం చేసినప్పుడు తనను భుజం తట్టి అభినందించారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన జ్ఞాపకాలు పాటలు తెలంగాణ సమాజంలో ఎప్పుడూ ప్రజలను చైతన్యం చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.



## ప్రమాద బాధిత కుటుంబానికి బీమా అందజేత




**మంచిర్యాల, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా ప్రమాద బీమా పథకంలో ప్రీమియం చెల్లించిన లబ్ధిదారుడి కుటుంబానికి 10 లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కు అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, పోస్టల్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్‌లతో కలిసి ప్రమాద బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారుడు అందె విజయ్ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌లో 520 రూపాయలు ప్రమాద బీమా పాలసీ తీసుకున్నారని, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారని తెలిపారు. తపాలా కార్యాలయం, టాటా గ్రూప్ ఆక్సిడెంటల్ గార్డ్ క్లెయిమ్ సెటిల్ కాగా బాధిత కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు అందజేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఈ పథకంలో 20 వేల మంది పాలసీ తీసుకున్నారని, ప్రజలు పోస్టల్‌లో ప్రమాద బీమా, పి.ఎం.జె.జె.బి.వై., సుకన్య ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌పోస్ట్ మాస్టర్ పివిఎస్ఎన్ కుమారి, ఐటిఐ ప్రిన్సిపాల్ రమేష్, పోస్టల్ మేనేజర్ సాగర్ పాల్గొన్నారు.



# ఏఐతో బోధన విద్యార్థులకు వరం

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, ఇంచార్జీ డీఈవో దీపక్ తివారి**

**ఆసిఫాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఏఐతో బోధన విద్యార్థులకు వరమని అదనపు కలెక్టర్, ఇన్ చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రాథమి కోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏఐ బోధన, విద్యార్థుల హాజరు శాతం పెంపుదల, నాణ్యమైన విద్య, బోధన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అందిస్తున్న బోధనలో విద్యార్థుల పురోగతి సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యా ర్థులను పర్యవేక్షించాలని చెప్పారు. విద్యార్థుల పఠన సామ ర్థ్యాలను పెంపొందించాలని తెలిపారు. ప్రశ్నలకు జవాబులు ఇవ్వడంలో తప్పులు చేస్తున్న విద్యార్థులను గుర్తించి వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. ఏఐ బోధన ద్వారా తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టులలో విద్యార్థులు పురోగతి సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల తల్లితండ్రు లతో మాట్లాడి ప్రతి రోజు పాఠశాలలకు హాజరయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



### ఘనంగా ప్రారంభమైన

## అఖండ హరి నామ సప్తాహ

**కుభీర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని మరో పండ రిపురంగా పిలుచుకునే విఠలేశ్వరాలయంలో మంగళ వారం అఖండ హరినామ సప్తాహ మంత్రోచ్ఛరణలన దుమ ఘనంగా ప్రారంభమైంది. ఆలయ పూజారులు ప్రమోద్ మహారాజ్, రాజు మహారాజ్ ఆలయ ప్రాంగ ణంలోని గణపతి, విఠల-రుక్మిణి విగ్రహాలకు ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేకంగా అలం కరించిన మండపంలో నిర్ణయించిన ముహూర్తంలో వేదుకలకు శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పెంటాజీ, ఉపాధ్యక్షుడు రాజన్న, కార్యదర్శి బచ్చు ప్రసాద్, గ్రామస్తులు పుప్పాల పీరాజీ, కందుర్ రాజన్న, భజన కారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆ అర్చకుడి పూజల పట్ల

## మహిళా భక్తుల ఆగ్రహం

**బెల్లంపల్లి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలం రాజరాజేశ్వర స్వామి దేవస్థా నంలో మహిళ భక్తురాలిపై అసభ్యంగా ప్రవర్తించిన అర్చకులు మంగళవారం పూజలు నిర్వహించడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 13న అర్చ కులు పూజల పేరిట ఒక మహిళా భక్తురాలి ఇంటికి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అర్చకునిపై శాఖ పరమైన చర్య లుతీసుకోకపోతే నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు.



# మంచిర్యాలలో జిల్లాలో హైఅలర్ట్

**ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో విస్తృత తనిఖీలు**

**మంచిర్యాల, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఢిల్లీలో బాంబుపేలుళ్ళతో మంచిర్యాలలో పోలీస్ శాఖ అలర్ట్ అయ్యింది. ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్ రావు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానిత ప్రయాణి కులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధి లోని సున్నిత ప్రాంతాలపై దృష్టి సారించారు. మంగళవారం రాత్రి పలు కూడళ్లలో వాహనాలను తనిఖీ చేశారు. పోలీసు లంతా అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద ప్రాంతాలు, వ్యక్తులపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు జిల్లా వ్యాప్తం గా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



# పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తాం

**మాజీ మంత్రి జోగు రామన్న**




**బేల, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు చేయూ తను అందించాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. బేల ఉన్నత పాఠ శాలను బీఆర్ఎస్ పార్టీ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మంగళ వారం బేల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదానేశ్వర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 70 మంది విద్యార్థులకు స్పో ర్ట్స్ దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా జోగు రామన్న మా ట్లాడుతూ.... బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బేల ఉన్నత పాఠశాల కోసం కోట్ల రూపాయలు నిధులు కేటాయించి పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశామని గుర్తు చేశారు. అందులో భాగంగానే అధికారంలో ఉన్నా లేకున్నా పాఠశాల అభివృద్ధి కోసం విద్యార్థులు ఉన్నతి కోసం బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదువుకోవడమే కాకుండా అన్ని రంగాల్లో రాణించేలా ముందుండాలని సూచించారు. దాతల సహాయం తో మరికొన్ని రోజుల్లోనే లక్ష రూపాయలతో పాఠశాల ఫర్నిచర్ తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రౌత్ మనోహర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, నాయకులు సతీష్ పవార్, తేజీరావ్ మస్కే, దేవన్న, మధుకర్ గోడే, మంగేష్ ఠాక్రే, తదితరులు పాల్గొన్నారు.



### పాఠశాలల్లో జరుగుతున్న

## పనులను వేగంగా పూర్తి చేయాలి

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన పనులను పూర్తి చే యాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మంగ ళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ అర్బన్, రూరల్, మావల, ఇచ్చోడ మండలాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న మౌలిక వస తుల పనులపై ఆయన మొదటి దశ సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యుత్ కనెక్షన్లు, త్రాగునీరు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ఎల్‌పీజీ కనెక్షన్లు, ప్రహరీ గోడలు, పెండింగ్ పనులు, తరగతి గదుల మరమ్మత్తులు తదితర అంశాల పురోగతిని పాఠ శాలల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో సమగ్ర మౌలిక సదుపాయాలు ఉండటం విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల పెరుగుదలకు కీలకమని పేర్కొన్నారు. ఇప్ప టికే అనేక పనులకు నిధులు విడుదలైనందున వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏంఈఓలు, హెడ్ మాస్టర్లు, ఇంజనీరింగ్ శాఖలు పరస్పర సమన్వ యంతో పనిచేస్తే నిర్దేశిత గడువులో పూర్తవుతాయని తెలిపారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, త్రాగునీరు, మిషన్ భగీరథ కనెక్షన్లు, ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్లు, తరగతి గదుల మరమ్మత్తు వంటి ప్రాథమిక సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పాఠ శాలల పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహించి పురోగతి నివేదికలు సమర్పించాలని సూచించారు. పనుల నాణ్యతపై కఠిన పర్యవేక్షణతోపాటు లోపాలను వెంటనే సరిచేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలకు సంబంధించిన పనుల రికార్డును నిరంతరం నవీక రించలన్నారు. సమావేశంలో ఐటిడిఎ పిఓ యువరాజ్ మర్మాట్, అదనపు కలెక్టర్, విద్యాశాఖ అధికారి రాజేశ్వ ర్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, కోఆర్డినేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో సహజ కవి అందెశ్రీకి ఘన నివాళి

**బెల్లంపల్లి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని స్థానిక తిలక్ స్టేడియం నుండి కాంటా చౌరస్తా ఏరియా వరకు తెలంగాణ జానపద కళాకారుల సంఘం మరియు ప్రజా సంఘాలు మేధావులు రచయితలు తదితరుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత డాక్టర్ అందెశ్రీ గారికి క్రొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించి కళాకారుల ఆటపాటలతో నివాళులర్పించడం జరిగింది. ఈ యొక్క కార్యక్ర మంలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాండ్ల మధుకర్ బెల్లంపల్లి పట్టణ అధ్యకుడు జంజీరాల దినేష్ కుమార్ బెల్లంపల్లి కళాకారులు సీనియర్ కళాకా రులు రామచందర్, మల్లేష్, రాజేష్, బాలకృష్ణ, జానీ, రాయమల్లు, రమాదేవి, రమేష్, శ్రీనివాస్, శంకర్, సుకుమార్, శ్రీహరి, పూలే పెరియార్ ఆలోచనా వేదిక అధ్యక్షుడు, దుబాసి రవి ఉపాధ్యక్షుడు, మిట్టపల్లి ప్రవీణ్, భరత్ రుషి, మిట్టపల్లి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేయాలి



### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సబుదాయంలోని వీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లాలోని ఎంపీడీవోలు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, విద్యాశాఖాధికారులు, గృహ నిర్మాణ శాఖాధికారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులు, నర్సరీలలో మొక్కల పెంపకం, ఈ నెల 14న పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహణ అంశాలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబి? పొందిన వారు పనులు త్వరగా పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం పూర్తి అయినందున ప్రతి లబ్ధిదారుడి ఇంటి నిర్మాణం ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. రెండు రోజులలో లబ్ధి పొందిన ప్రతి లబ్ధిదారుడు పనులు ప్రారంభించాలని ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు ప్రారంభించేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్య వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. 2026 సంవత్సరం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 52 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో లక్ష్యానికి అనుగుణం గా నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. అవసరమైన మట్టి, విత్తనాలను సేకరించాలని తెలిపారు. ఈ నెల 14న ప్రతి ప్రభుత్వ యజమాన్య ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై వివరించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వందశాతం సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రకాష్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఏపీవోలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.



### జిల్లాకు చేరుకున్న ఫైనాన్స్
## కమిషన్ ఛైర్మన్ రాజయ్య

**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం పట్టణంలోని సాత్నాల వసతి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ కమిషన్ చైర్మన్‌కు పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### విద్యార్థుల ఉన్నత శిఖరాలకు
## ఎన్‌సీసీ తోడ్పడుతుంది



**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఎంతో తోడ్పడుతుందని ఆదిలాబాద్ 32 బెటాలియన్ సుబేదార్ జగదీప్ సింగ్ పేర్కొన్నారు. జుమేరాత్ పేట్ హైస్కూల్లో వారం రోజుల నుంచి కొనసాగుతున్న క్యాడేట్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణ పొందిన విద్యార్థులకు ఎంతో మెరుగైన భవిష్యత్తు ఉందన్నారు. ఉపాధి అవకాశాలలో సైతం మంచి అవకాశాలు ఉన్నాయన్నారు.

### మైసమ్మ తల్లి ఆలయంలో ఎస్సీ,ఎస్టీ
## కమిషన్ సభ్యులు ప్రవీణ్ పూజలు



**బెల్లంపల్లి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని శాంతిఖని గని ఆవరణలో కొలువైన శ్రీ మైసమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు, కార్మికులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

## పోలీసుల తనిఖీలు

**రామకృష్ణాపూర్, నవంబర్11 (ప్రభాత సమాచారం)**

ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మంగళవారం మందమర్రి పట్టణంలోని టోల్ ప్లాజా వద్ద సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలు సేకరించారు. వాహన తనిఖీలు చేపట్టి సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో మందమర్రి ఎస్సై రాజశేఖర్, ఆర్కేపీ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

**జైనూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

భారత సమరయోధుడు, తొలి దేశ విద్యా శాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉన్నత చదువులు రాణించాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథరావు అన్నారు. మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా జాతీయ విద్య దినోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థుల కోసం క్లారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి అన్ని వసతులుతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత చదువులు చదివి విద్యావంతులుగా ఎదగాలన్నారు. ఐఏఎస్ ఐపీఎస్లు డాక్టర్లు ఇంజనీర్లుగా ఎదిగి సమాజంలో మంచి సేవలు అందించాలని అన్నారు. జాతీయ విద్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆయా పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి మజారోద్దీన్, మాజీ జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబుతాలి బ్, మైనారిటీ నాయకులు ఫాజిల్ బియబాని, సన్ రైజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ జమీల్, ఎంఏ ఆజాద్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ అసద్ అలీ, మాజీ సర్పంచులు భూపతి, జాలింశావ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



**దండేపల్లి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజు ప్రత్యేక తరగతుల ద్వారా నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య సూచించారు. దండేపల్లి మండలం వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఉదయం వేళలో విద్యార్థులకు అందించే రాగిజావా పంపిణీ తీరును పరిశీలించారు. ఆనంతరం తరగతి గదికి వెళ్లి పదో తరగతి విద్యార్థులకు అందించే విద్యాబోధన తీరును పరిశీలించి, వారి ప్రతిభ సామర్థ్యాలను పరిశీలించారు. ఎస్ఏ1 పరీక్షలో వచ్చిన మార్కుల తీరు నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అలందించాలన్నారు. ముందుగా మధ్యాహ్న భోజనశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరుపట్టిక, ఉపాధ్యాయుల విద్యాబోధన తీరును పరిశీలించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ఉపాధ్యాయులున్నారు.




## చదువుతోనే సమాజంలో గుర్తింపు

### నిర్మల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ రాధిక

**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

ప్రతి ఒక్కరూ చదువుకొని సమాజంలో మార్పు కోసం పని చేయాలని సీనియర్ సివిల్ జడ్జి జిల్లా లీగల్ సెల్ చైర్మన్ జి.రాధిక అన్నారు. పట్టణంలోని కస్బా ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవంలో పాల్గొన్నారు. తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చదువుకున్న ప్రాధాన్యతను గుర్తించి అనేక ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్య హక్కు చట్టం కూడా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ ఎన్సిసి అధికారి ప్రసన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు జిల్లాలో
## మంత్రి వివేక్ పర్యటన

**మంచిర్యాల, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బుధవారం చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటిస్తారని జిల్లా నాయకులు తెలిపారు. భీమారంలో కేజీబీవీ నూతన భవనాన్ని ప్రారంభించి గొల్లవాగు ప్రాజెక్టులో ఉచిత చేప పిల్లలను విడుదల చేస్తారు. అనంతరం చెన్నూర్ మండలం శివలింగాపూర్‌లో పత్తి కొనుగోలు కేంద్రం, కోటపల్లి మండలం దేవులవాడలో నూతన సబ్ సెంటర్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.



# రైతుల ఆదాయం పెంచే దిశగా చర్యలు







**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయంలో సాంకేతికతను చేరువ చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం గుడిహత్నూర్ మండలం సీతగొందిలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం 2025–26, ఆయిల్ పామ్ సాగుపై రైతుల అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. కూరగాయాల నర్సరీని పరిశీలించిన అనంతరం కలెక్టర్, రైతులకు సంకరజాతి కూరగాయల నాట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి లాభదాయక పంటలు సాగు చేయాలన్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా బహుళ పంటల సాగు విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఇది వా తావరణ మార్పులు, పంట నష్టాల నుండి రక్షణ కల్పించడమే కాకుండా స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు, సంకరజాతి కూరగాయల విస్తరణ పథ కాలు రైతులకు లాభదాయక అవకాశాలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆధునిక వ్య వసాయ పద్ధతుల అమలుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచే పంటలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆయిల్ పామ్ పంటలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, రైతులకు సబ్సిడీ అందుబాటులో ఉందని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో ఈ పంటలకు ప్రభుత్వం నిరంతర ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, కొత్త సైన్స్ ప్రాజెక్టులను జిల్లాకు తీసుకురావడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి నర్సయ్య, అధికారులు, నర్సరీ యజమానులు, రైతులు, పాల్గొన్నారు.




## మహిళ మరణానికి కారణమైన వ్యక్తి అరెస్ట్

**బోథ్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని బజార్‌హత్నూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనలో మంగళవారం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసినట్టు బోథ్ సీఐ గురుస్వామి తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. బజార్ హత్నూర్ గ్రామానికి చెందిన చేవుల రత్నమాల (48) నవంబర్ 9 న సాయంత్రం తన కుమారుడు చేవుల లక్ష్మణ్ (22)తో కలిసి వ్యవసాయ పనులు ముగించుకొని ఎద్దుల బండి పై గ్రామానికి వెళ్తోంది. అదే సమయంలో నిందితుడు తరడపు ప్రదీప్ కుమార్ తన కారును మద్యం మత్తులో అత్యంత నిర్లక్ష్యంగా, వేగంగా నడుపుతూ బజార్ హత్నూర్ గ్రామ శివారులో ఎద్దుల బండిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బాధితురాలు చేవుల రత్నమాల గాయాలతో అక్కడికక్కడే మరణించింది. ఆమె కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దర్యాప్తు ద్వారా నిందితుడు మద్యం సేవించి వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో బోథ్ ఎస్ఐ శ్రీ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడపవద్దు



**జన్నారం, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

మద్యం తాగి వాహనాలు నడపవద్దని జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష హెచ్చరించారు. మంగళవారం జన్నారంలోని బస్టాండ్ ఏరియా, ధర్మారం చౌరస్తాలలో వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలన్నారు.

## నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు

**చెన్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**



చెన్నూరు సబ్ స్టేషన్‌లో నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ ఉత్తమ్ జాడే మంగళవారం ప్రకటనలో తెలిపారు. చెన్నూరు, భీమారం, కోటపల్లి, జైపూర్ మండలాల పరిధిలోని వినియోగదారులు బిల్లులు, ఇతర విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామన్నారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ప్రతి సంవత్సరం జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన విశిష్ట పాత్రను స్మరించుకుంటూ, స్వాతంత్రం అనంతరం భారత తొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి నిరంతరం శ్రమించి, అనేక సంస్కరణలను తీసుకువచ్చారని పేర్కొన్నారు. మైనారిటీల విద్యా అభివృద్ధి, మహిళా విద్యా ప్రోత్సాహానికి ఆయన చూపిన కృషి ఎంతో విలువైనదని తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి మహనీయుల జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయ కమని, యువత ఆయన ఆలోచనలను, విలువలను అనుసరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, మైనార్టీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మైనార్టీ సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం త్వరగా అందించాలి



**బోథ్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

వన్యప్రాణుల కారణంగా పంట నష్టపోయిన బాధిత రైతులకు తక్షణమే ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందేలా చూడాలని బోథ్ నేచర్ కన్జర్వేషన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అలీ కోరారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులకు సొసైటీ సభ్యులతో కలిసి వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు షేక్ అలీ మాట్లాడుతూ వన్యప్రాణుల దాడులలో పంట నష్టపోయిన బాధిత రైతులు నష్ట పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే అటవీ, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి బాధిత రైతులకు నష్టపరిహారం త్వరగా అందేలా చూడాలన్నారు. కొన్నిసార్లు శాఖల మధ్య సమన్వయం లేక నష్ట పరిహారం కోసం బాధిత రైతులు రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. వినతిపత్రాన్ని అందించిన వారిలో సొసైటీ ఉపాధ్యక్షుడు దాసరి పురుషోత్తం, కోశాధికారి పృథ్వి, అబ్దుల్ రావుఫ్, రమణ తదితరులున్నారు.



## పారిశుధ్యం మెరుగుపరచాలి

**మందమర్రి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని మండల పంచాయతీ అధికారి ఎం సత్యనారాయణ సూచించారు. గ్రామ పంచాయతీ ఇన్స్పెక్షన్ యాప్‌లో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని అందుగుల పేట గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి, తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని, గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు లేకుండా చూసుకోవాలని, మురికి కాలువలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో నీటి సరఫరా, శానిటేషన్‌కు సంబంధించిన 7 రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వీరేందర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణంలో పోలీసుల తనిఖీలు

**బెల్లంపల్లి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణంలో కాంటా చౌరస్తా, కొత్త బస్టాండ్, కన్నాల హైవే వద్ద మంగళవారం రాత్రి వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలను పరిశీలించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా మండలంలో ఎస్సై కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.



# ఉట్నూర్ ధర్మ యుద్ధ బహిరంగ సభకు అనుమతులు ఇవ్వండి



**ఉట్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
హలో ఆదివాసి, చలో ఉట్నూర్ " ధర్మ యుద్ధ బహిరంగ సభను ఈనెల 23న ఉట్నూరులో నిర్వహిస్తున్నందున పోలీసు శాఖ అనుమతులు ఇవ్వాలని కోరుతూ తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాది రావు, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సేడ్మాకి రామారావులు అధికారులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ లో ఎస్సై ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఈనెల 23నఉట్నూర్ లోని ఎంపీడీవో నిర్వహించనున్న ధర్మ యుద్ధం సభాస్థలిని ఆదివాసి ప్రతినిధులు పరిశీలించారు. సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పెందురు దాధీ రావు, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సే డ్మా కి రామారావు లు మాట్లాడుతూ చట్టబద్ధత లేని లంబాడలను ఎస్ టీ జాబితా నుంచి తొలగించాలన్న డిమాండ్‌తో బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసి గిరిజనులు భారీ సంఖ్యలో ప్రతి ఇంటి నుంచి తరలివస్తున్నందున ఈ సభను విజయవంతం చేసి ప్రభుత్వానికి ఆదివాసి గిరిజనుల డిమాండ్ తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆదివాసీ బచావో, లంబాడా హటావో అనే ప్రధాన నినాదం తో గత వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఉన్న గిరిజన గ్రామాలను ఆదివాసి నాయకులు చుట్టుముట్టి గిరిజనుల్లో చైతన్యవంతులను చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. వలస వచ్చిన లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలిగించలనే ఏకైక డిమాండ్ ధర్మ యుద్ధం పేరిట ఆదివాసిల భారీ బహిరంగ సభకు ఆదివాసీల సంఘాల నాయకులు మద్దతు పలికారని అన్నారు. కార్యక్రమంలో రాయసీడం జంగు పటేల్, కుమ్మరం శత్రుఘన్నావ్, పూసం ఇస్రూ పాల్గొన్నారు.



స్వంత గ్రామానికి వెళ్లే దారి బ్రిడ్జి

## నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**ఉట్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
రెండేళ్లకు ముందు వరకు ఆ గ్రామానికి వెళ్లాలంటే ప్రజలు పడే కష్టాలు అంతింత కావు.. కన్నీళ్లు దిగమింగుకుంటు కాలి నడకన రాకపోకలు సాగించేవారు. వారి కష్టాలు వినే నాథుడే లేడు. కానీ రెండేళ్ల క్రితం ఆ గ్రామానికి అదృష్టం వరించింది.. ఆ గ్రామమే కల్లూరు గూడ.. ఘనపూర్ పంచాయతీ పరిధిలో ఉంది. ఆ గ్రామ యువకుడు వెడ్మ భోజ్జు పటేల్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో కల్లూర్‌గూడ గ్రామానికే కాదు ఆ ప్రాంతాలకే కొత్త పుంతలు వచ్చాయి.. వెడ్మ బొజ్జు పటేల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే తన గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయించారు. గ్రామస్థులకల నెరవేరింది. రోడ్డు పనులు పురోగతిలో ఉన్నాయి. రహదారి మధ్యలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంతో సాగుతున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే ఆర్అండ్‌బి శాఖ ఈఈ, డిఈఈ తో పాటు వివిధ అధికారులతో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు.



## లింగాపూర్ @ 8.7 డిగ్రీలు

### ఏజెన్సీని వణికిస్తున్న చలి
### ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు



**ఆసిఫాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఏజెన్సీ ప్రాంతాల్లో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలి తీవ్రత పెరుగుతున్నది. మంగళవారం రాష్ట్రంలోనే కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. లింగాపూర్‌లో 8.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు జంకుతున్నారు. ఒక్కరోజులోనే 2.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. చలి నుంచి రక్షణగా ఉండేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు వీలైనంత వరకు బయటకు వెళ్లకుండా ఉండటమే మేలని చెబుతున్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
మండలంలోని చాందా (టి) శివారులో పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన అబ్దుల్ సత్తార్, ఆజీజ్, నదీం మంగళవారం మహారాష్ట్రలో విక్రయించేందుకు ఆటోలో బియ్యం తీసుకెళ్తుండగా 3.5 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆటో స్వాధీనం చేసు కోని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**కుభీర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న రైతులు పండించిన పంటను కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర 5325ధరను అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ గంగాచరణ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పల్సి గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండేందుకు అదనంగా ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతు సోదరులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రల ద్వారా సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ సహకార సంఘం సిబ్బందికి సహకరించి, రైతులకు అందించిన టోకెన్ల తేదీల ప్రకారం మార్కెట్కు తీసుకురావాలని కోరారు. అదేవిధంగా తమ పండించిన పంటలకు తేమ 12 శాతం కంటే అధికంగా ఉండకుండా చూడలని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చెర్మన్ గంగాచరణ్, మార్కెట్ కమిటీ చెర్మన్ కళ్యాణ్, తహసీల్దార్ శివ రాజ్, మండల నాయకులు పురం శెట్టి రావి కుమార్, దత్త హరి పటేల్, శ్రీరాముల రాజేష్, రమేష్ హనుమల్లు,సహకార సంఘం కార్యదర్శి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

# గుండెపోటుతో యువ వైద్యుడు మృతి



### రిమ్స్‌లో విషాదఛాయలు

**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఓ యువ వైద్యుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. రిమ్స్ వైద్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రిమ్స్ సీఎంఓగా పని చేసే యువ వైద్యుడు జి.నగేష్ గౌడ్ (30) టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయనకు మంగళవారం రాత్రి ఛాతీలో నొప్పి రావటంతో రిమ్స్‌కు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, ఈసీజీ నార్మల్‌గా ఉండటంతో అక్కడి నుంచి ఖోజా కాలనీలో ఉండే అతని స్నేహితుడు డాక్టర్ నితిన్ వద్దకు వెళ్లాడు. అక్కడ ఒకే సారి ఫిట్స్ లాగా రావటంతో కింద పడిపోయాడు. వెంటనే డాక్టర్ నితిన్ సీపీఆర్ చేస్తూనే రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు వెల్లడించారు. దీంతో రిమ్స్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాథోడ్ జైసింగ్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ దీపక్ పుష్కర్, రేడియాలజీ విభాగాధిపతి కళ్యాణ్ రెడ్డి అక్కడకు చేరుకొని వివరాలు ఆరాతీశారు. వైద్యుడు ఆకస్మిక మృతి పట్ల దిగ్భ్రాంతికి గురయ్యారు.



బైకుల చోరీ నియంత్రణకు

## తనిఖీ కేంద్రం ఏర్పాటు

**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చోటు చేసు కుంటున్న ద్విచక్ర వాహనాల చోరీలను అరికట్టడానికి పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో దొంగ తనాలను నిరోధిండానికి పోలీసులు కొత్త విధానాన్ని ప్రారంభించారు. బయటకు వెళ్లే ప్రధాన ద్వారం వద్ద మంగళవారం నుంచి ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు ఇద్దరు పోలీసులు తనిఖీలు చేసేలా ఏఆర్ పోలీసులను నియమించారు. రిమ్స్ నుంచి బయటకు వెళ్లే వాహనాలను వారు నిశితంగా తనిఖీలు చేశారు. వాహనానికి సంబంధించిన పత్రాలు ఉంటేనే వదులుతున్నారు. ఈ విషయమై టూటౌన్ ఇన్స్పెక్టర్ కె.నాగరాజు మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచనల మేరకు ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. 24 గంటలు తనిఖీలు కొనసాగేలా ప్రణాళిక రూపొందించామన్నారు.


## బంగారు పతకం సాధించిన సహస్ర

**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఈనెల 7వ తేదీ నుంచి నుంచి 9 వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగిన అండర్ 17 పాఠశాల ఎస్‌జిఎఫ్ బాలికల విభాగంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించిన విషయం తెలిసిందే. ఇందులో జిల్లా కేంద్రంలోని రిసోనెన్స్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న నడిమెల సహస్ర రావు బంగారు పతకం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ప్రమోద్ రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు వినోద్ పెంటన్న స్వర్ణలత తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించిన సహస్రను శాలువాతో పాటు ఘనంగా సత్కరించారు.



# భర్త మహాశయులకు.. రామసత్యనారాయణ విజ్ఞప్తి!

పెళ్లైన వాళ్లకి తనలాంటి పరిస్థితి ఎదురవకూడదని కోరుకుంటా అంటున్నారు రవితేజ. మరి ఆయనెందుకు ఇలా అన్నారు? పెళ్లి విషయంలో తనకెదురైన పరిస్థితులేంటి? తెలియాలంటే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా చూడాల్సిందే. రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కిశోర్ తిరుమల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే ప్రచారంలో ఉన్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరును ఖరారు చేస్తూ.. సోమవారం టైటిల్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. "భక్త మహాశయులకు విజ్ఞప్తి" అంటూ ఓ గుడిలో నుంచి వినిపించే అనౌన్స్‌మెంట్‌తో మొదలైన ఈ ప్రచార చిత్రం.. ఆ తర్వాత రవితేజ వాయిస్ ఓవర్‌తో ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. "నా జీవితంలోని ఇద్దరు ఆడాళ్లు నన్ను రెండు ప్రశ్నలు అడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్, ఏఐ, చాట్ జీపీటీ, జెమినీ అన్నింటినీ అడిగాను. వాటికి పెళ్లి కాకపోవడం వల్ల నన్ను ఇంకా కన్ఫ్యూజ్ చేశాయి. అనుభవం ఉన్న మగాళ్లని.. ముఖ్యంగా మొగుళ్లని అడిగాను. ఆశ్చర్యపోయారే తప్ప ఆన్సర్ ఇవ్వలేకపోయారు. ఇలాంటి ప్రశ్న మిమ్మల్ని ఏ ఆడవాళ్లు అడగకూడదని కోరుకుంటూ.. మీ ఈ రామసత్యనారాయణ చెప్పేది ఏంటంటే" అంటూ టైటిల్ గ్లింప్స్ సారాంశాన్ని వినిపించారు. వినోదాత్మకంగా సాగే ఈ కుటుంబ కథా చిత్రంలో రవితేజ స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నట్లు గ్లింప్స్‌ను బట్టి అర్థమవుతోంది. ఈ సినిమా ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉంది. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తుండగా.. ప్రసాద్ మూరెళ్ల ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.



# రిలీజ్‌కు ముందే విజయ్ 'జన నాయకన్' రికార్డులు..

తమిళ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న కొత్త చిత్రం 'జన నాయకన్' థియేటర్లలోకి రాకముందే భారీ హైప్ సృష్టించింది. ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 9, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. కానీ విడుదలకు ముందే ఈ చిత్రం రూ. 325 కోట్లకు పైగా వసూలు చేస్తూ రికార్డులు తిరగరాస్తోంది. సినిమా తమిళనాడు థియేట్రికల్ హక్కులు మాత్రమే రూ. 100 కోట్లకు పైగా అమ్ముడయ్యాయి. విదేశీ హక్కులు మరో రూ. 80 కోట్లు, మ్యూజిక్ రైట్స్ రూ. 35 కోట్లు, ఇక అమెజాన్ ప్రైమ్ వీడియో డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను రూ. 110 కోట్లకు సొంతం చేసుకుంది. ఇలా మొత్తం ఇప్పటివరకు రూ. 325 కోట్లు రాబట్టి, ఇంకా ఇతర హక్కులు అమ్ముడైన తర్వాత ఈ మొత్తం రూ. 400 కోట్లను తాకే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమా ప్రత్యేకత ఏమిటంటే, ఇది విజయ్ రాజకీయాల్లోకి అడుగు పెట్టే ముందు చివరి సినిమా కావొచ్చని సమాచారం. దీంతో ఆయన అభిమానులు ఈ చిత్రంపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. సినిమాకు ముందు నుంచే ఉన్న ఈ ఉత్సాహం దాని వ్యాపార విలువను మరింత పెంచింది. ఈ చిత్రానికి హెచ్. వినోత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన ముందు చేసిన యాక్షన్ సినిమాలు ప్రేక్షకుల్లో మంచి ఇంపాక్ట్ చూపించాయి. అందుకే ఆయన దర్శకత్వంలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై కూడా విశేష ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ఇందులో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ సినిమాతో తమిళ్ సినిమాల్లో అరంగేట్రం చేస్తున్నాడు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా యాక్షన్, ఎమోషన్, రాజకీయ టచ్ కలయికగా రూపొందుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల అంచనా ప్రకారం, ఈ సినిమా విడుదలయ్యాక బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు నెలకొల్పే అవకాశం ఉంది. విజయ్ అభిమానులు ఈ సినిమాను ఆయన రాజకీయ ప్రయాణానికి ముందరి మైలురాయిగా చూస్తున్నారు. ట్రైలర్, పాటలు, పోస్టర్లు అన్నీ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొత్తం మీద 'జన నాయకన్' సినిమా విడుదలకు ముందే చేసిన ఈ వ్యాపారం, దాని మీద ఉన్న ఆసక్తిని స్పష్టంగా చూపిస్తోంది. విజయ్ స్టార్ పవర్, దర్శకుడు వినోత్ డైరెక్షన్ టచ్, గ్రాండ్ ప్రొడక్షన్ విలువ అన్నీ కలసి ఈ చిత్రాన్ని 2026లో భారీ హిట్‌గా నిలపవచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



# పూజా అసలైన కంబ్యాక్ ఇదేనా?



సాధారణంగా పెద్ద హీరోల సినిమాలు ఏవైనా వస్తే అందులో అందరి అటెన్షన్ హీరోలపైనే ఉంటుంది. అందులో ఎంత పెద్ద స్టార్ హీరోయిన్ నటించినా ముందుగా అందరూ చూసేది హీరోనే. కానీ ఇప్పుడు కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ పై ఉండాల్సిన ఫోకస్ మొత్తాన్ని బుట్టబొమ్మ పూజా హెగ్డే తన వైపుకు తిప్పేసుకున్నారు. ఇదంతా దేని గురించి అనుకుంటున్నారా? జన నాయగన్ మూవీలోని ఫస్ట్ సింగిల్ దళపతి కచేరి గురించి. ఈ సాంగ్ లో పూజా హెగ్డే సాంప్రదాయంగా చీరలో కనిపించడమే కాకుండా, విజయ్ ఎనర్జీని మ్యాచ్ చేయడంతో పాటూ శారీలో పూజా అద్భుతమైన లుక్స్, మంచి గ్రేస్‌ఫుల్ మూమెంట్స్ తో అందరినీ ఎట్రాక్ట్ చేశారు. దీంతో ఇప్పుడామె స్క్రీన్ ప్రెజెన్స్ పెద్ద చర్చనీయాంశంగా మారడంతో దళపతి కచేరి సాంగ్ సక్సెస్ కు పూజా క్రెడిట్ అందుకున్నారు. దాదాపు రెండు మూడేళ్ల గ్యాప్ తర్వాత పూజా కోలీవుడ్ కు కంబ్యాక్ ఇవ్వగా, సెకండ్ ఇన్నింగ్స్ లో పూజా చేసిన ప్రయత్నాలేవీ సక్సెస్ అవలేదు. రీసెంట్ గా సూర్య తో రెట్రో సినిమా చేసిన పూజా, ఆ మూవీతో మంచి కంబ్యాక్ ఇస్తుందనుకుంటే రెట్రో మూవీ ఫ్లాప్ గా నిలిచింది. రెట్రో ఫ్లాపైనా రజనీకాంత్ కూలీ మూవీలో మోనికా సాంగ్ తో అందరి దృష్టిని ఆకర్షించి ఆ సాంగ్ ను చార్ట్‌బస్టర్ గా నిలిపారు. మోనికా సాంగ్ తో అందరినీ అలరించిన పూజా ఇప్పుడు దళపతి ఆఖరి సినిమాగా వస్తున్న జన నాయగన్ లో ఫీమేల్ లీడ్ గా కనిపించనున్నారు. ఈ సినిమాలోని ఫస్ట్ సాంగ్ తో పూజా తన మార్క్ ను వేయగా, దళపతి సాంగ్ లో పూజా లుక్స్, డ్యాన్స్ మూవ్స్ హైలైట్ గా నిలిచాయి. ఈ సాంగ్ లో కెమెరాను పూజా నడుము, నాభి పైనే ఎక్కువగా ఫోకస్ చేసినందుకు సోషల్ మీడియాలో కొంతమంది మేకర్స్ ను విమర్శించినప్పటికీ ఆడియన్స్ మాత్రం ఆ విజువల్స్ ను చూసి ఎంజాయ్ చేస్తూ, పూజా గ్లామర్ లుక్స్ ను అభినందిస్తున్నారు. తన లుక్స్, డ్యాన్సులు, గ్లామర్ తో దళపతి కచేరి సాంగ్ ను రిలీజైన కొన్ని గంటల్లోనే వైరల్ చేసిన పూజా కు ఇది నిజమైన కంబ్యాక్ లాంటిదని ఆమె ఫ్యాన్స్ భావిస్తూ పూజాని ప్రశంసిస్తూ నాన్‌స్టాప్ గా హ్యాష్ ట్యాగులను ట్రెండ్ చేస్తున్నారు. ఈ కారణంతోనే పూజా ఇప్పటికీ సౌత్ ఇండియాలో మోస్ట్ గ్లామరస్ హీరోయిన్లలో ఒకరిగా చలామణి అవుతుందని అందరూ అంటున్నారు. ఇక జననాయగన్ విషయానికొస్తే ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే.

# బ్లాక్ శారీలో భాగ్య శ్రీ హాట్



యంగ్ బ్యూటీ భాగ్య శ్రీ బోర్సే నెట్టింట లేటెస్ట్ ఫొటోలు షేర్ చేసింది. బ్లాక్ శారీలో ఈ ముద్దుగుమ్మ ఫోజులు కుర్రకారును ఫిదా చేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన పిక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ పిక్స్ చూసిన నెటిజన్లు వావ్, స్టన్నింగ్ అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం 'కాంతా' మూవీ ప్రమోషన్స్ లో బిజీగా ఉంది ఈ బ్యూటీ. దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం భాగ్య శ్రీ హీరోయిన్ గా నటిస్తోంది. తెలుగులో రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో పరిచయమైంది. ఈ సినిమా ఆశించిన విజయం సాధించకపోయినా.. ఈ అమ్మడు మాత్రం తన గ్లామర్, నటన, డాన్స్ తో ఆడియన్స్ ని ఫిదా చేసింది. ఆ తర్వాత నుంచి కోలీవుడ్, టాలీవుడ్ లో వరుస ఆఫర్లు పట్టేసింది. ఇటీవలే విజయ దేవరకొండ సరసన కింగ్డమ్ సినిమాలో మెరిసింది. ప్రస్తుతం తెలుగులో రామ్ పోతినేని సరసన 'ఆంధ్ర కింగ్ తాలుకా' సినిమాలో కూడా నటిస్తోంది. ఇటీవలే ఫిల్మ్ ఫేయిర్ అవార్డులో 'ఎమర్జింగ్ ఫేస్ ఆఫ్ ది ఫ్యాషన్' అవార్డు లభించింది. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్ కనిపించే ఈ బ్యూటీ 1 మిలియన్ పైగా ఫాలోవర్లు ఉన్నారు.

# అన్నదాతకు అండగా అఖిల పక్షం

- తేమ నిబంధన, కొనుగోళ్ల పరిమితిపై దశలవారీగా ఆందోళనలకు తీర్మానం
- అఖిలపక్ష సమావేశంలో జోగు రామన్న



**ఆదిలాబాద్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అమ్ముకోవడానికి రైతుల పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారి పక్షాన పోరాడేందుకు అఖిలపక్షం నేతలు ముందుకొచ్చరు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ దశల వారిగా ఆందోళనలకు సిద్ధం కావాలని అఖిల పక్షం పార్టీ నేతలు తీర్మానించారు. ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ మంత్రి నేతృత్వంలో బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ధర్మ సమాజ్ పార్టీ, రైతు సంఘాల నేతలు సమావేశమై తేమ శాతం నిబంధన, కొనుగోళ్లలో పరిమితి విధించడంతో పాటు అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు, వాటి సాధనకు చేపట్టవలసిన భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చిం చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ... అన్నదాతలకు అండగా నిలవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. తేమ నిబంధనలు, కొనుగోళ్లలో పరిమితిని విధిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. తేమ నిబంధనలతో రైతులు పంటను అమ్మే పరిస్థితి లేదని, జిల్లలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నిబంధనలు సడలించాల్సిన అవసరముందన్నారు. ఎకరానికి ఏడూ క్వింటల్ల పరిమితిని తెచ్చి మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. పంటను అమ్ముకునేందుకు అన్నదా త నానా ఇబ్బందులు పడుతుంటే స్థానిక ప్రజా ప్రతినిధులు కనీసం స్పందించకపోవ డం శోచనీయమన్నారు. వేలిముద్ర నిబంధనను తొలగించడంతో పాటు, ఓటిపి నిబం ధనతో సోయాలను కొనుగోలు చేసేందుకు కృషి చేయాలి పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు వారి తరపున నిలబడతామని, రైతు సంఘాలు, అఖిల పక్ష నేతలతో కలిసి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు దర్శనాల మల్లేష్, సిర్రా దేవేందర్, విజ్జగిరి నారాయణ, వెంకట నారాయణ, జగన్ సింగ్, రత్నపురి రమేష్, అగ్గిమల్ల గణేష్, బండి దత్త్రాత్రి, కొండ రమేష్ లోకారి పోశెట్టి, దారట్ల కిష్టు, గోవర్ధన్ యాదవ్ చిలుక దేవిదాస్, వినేష్, శివ కుమార్, లక్ష్మణ్, గంద్రత్ రమేష్ సెవ్వ జగదీష్, కనక రమణ తదితరులు పాల్గొన్నారు.

# కైరిగూడ శివారులో పెద్దపులి

**పులి దాడిలో మృతి చెందిన ఆవు, లేగదూడ**

**నిర్ధారించిన అటవీ అధికారులు - అప్రమత్తంగా ఉండాలని సూచన**

**రెబ్బెన, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కైరిగూడ సమీపంలో పెద్దపులి కదలికలు మొదలయ్యాయి. గ్రామానికి చెందిన ఒక ఆవుతో పాటు లేగదూడపై దాడి చేసి హత మార్చింది. మంగళవారం తెల్లవారుజామున కమ్మరి కుంట సమీపంలో పెద్దపులి దాడిలో చనిపోయిన ఆవుతో పాటు లేగ దూడను గ్రామస్తులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు సమీపంలో లభ్యమైన పాదముద్రలను బట్టి ఇది పెద్దపులి పనే అని నిర్ధారించారు. మూడు నెలల క్రితం మహారాష్ట్ర నుండి వచ్చిన పెద్దపులి రెబ్బెన, తిర్యాణి, బెల్లంపల్లి, దేవాపూర్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో సంచరిస్తోంది. పెద్దపులి దాడిలో మృతి చెందిన పశువుల కళేబరాల వద్ద పులి కదలికలను గుర్తించేందుకు కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు. పెద్దపులికి ఎలాంటి హాని జరగకుండా అటవీశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కైరిగూడ, సోనాపూర్, గోలేటి గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. పత్తి తీసే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చేలవద్దకు ఒంటరిగా కాకుండా గుంపులుగా, చప్పుడు చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. ఉదయం 10 గంటలకు వెళ్లి సాయంత్రం 3 గంటలలోపు ఇళ్లకు చేరుకోవాలన్నారు. పెద్దపులి కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. మృతి చెందిన పశువుల యజమానులు దరఖాస్తు చేసుకుంటే పరిహారం అందజేస్తామన్నారు.

**ఆవులను చంపింది పులే..**

మండలంలోని దేవాయిగూడ పంచాయతీ పరిధిలోని తోయగూడెంలో రెండు ఆవులు 10న మృతి చెందిన విషయం విధితమే.. అయితే ఈ ఆవులను చంపింది పెద్ద పులి అని గుర్తించినట్లు ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. తోయగూడెం, చందుగూడ, చోపిడి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రి సమయంలో ఎట్టి పరిస్థితులల్లో అడవి వైపు వెళ్లకూడదని సూచించారు.






**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

ఉమ్మడి జిల్లాలో తెల్ల బంగారంగా పిలుచుకునే పత్తికి ఈ యేడు ధర లేదు. భారీ వర్షాలతో పంట దెబ్బతినగా దిగుబడి తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్న పంటను అకాల వర్షాలు దెబ్బతీస్తుండటం, మార్కెట్‌కు వస్తే ధర లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం పండిన పత్తిని అమ్మినా పెట్టుబడి వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎట్టకేలకు సీసీఐ పత్తి కొనుగోళ్లను ప్రారంభించినా మద్దతు ధర వస్తుందో రాదో అనే టెన్షన్ నెలకొంది. ఉమ్మడి జిల్లా పరిధిలో అన్ని మార్కెట్ యార్డులతో పాటు ఎంపిక చేసిన జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలుకు సిద్ధమవుతుంది. కపాస్ కిసాన్ యాప్ ద్వారా నమోదు చేసుకున్న రైతుల పత్తిని సీసీఐ కొనుగోలు చేయనుంది. రైతులు, రైతు సంఘాల నేతలు మాత్రం కొర్రీలు పెట్టకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### భారీగా తగ్గిన దిగుబడి..

ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ యేడు ధర వస్తుందనే నమ్మకంతో ఎక్కువమంది రైతులు పత్తి సాగు చేశారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో పడిన భారీ వర్షాలతో నీళ్లు నిలిచి పంట దెబ్బతింది. ఆరు జిల్లాల పరిధిలో పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగింది. ఉన్న పంట కూడా అకాల వర్షాలతో దెబ్బతింటుంది. పత్తి చేనులోనే తడిసి నల్ల బడుతోంది. ఏరిన పత్తి కూడా ఆరబోసినా ఫలితం ఉండడం లేదు. ఈ యేడు వర్గాలతో దిగుబడి తగ్గింది. ఎకరాకు పది క్వింటాల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేసినా ప్రస్తుతం 5 నుంచి 8 క్వింటాళ్ల వరకే వస్తుంది. కొంత మంది రైతులకు అంతకన్నా తక్కువ దిగుబడి వస్తోంది.

### అకాల వర్షాలతో తప్పని తిప్పలు...

జిల్లాలో పత్తి రైతులకు పరేషాన్ తప్పడం లేదు. ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలతో ఆశించిన దిగుబడి రాక ఇప్పటికే ఆందోళన చెందుతున్నారు. వచ్చిన అరకొర పంటను మార్కెట్‌లో విక్రయించేందుకు సైతం అవస్థలు తప్పడం లేదు. తేమ శాతం 12దాటితే కొనేందుకు సీసీఐ నిరాకరిస్తుండగా.. ప్రైవేట్ వ్యాపారులు ధర తగ్గించడం వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. విక్రయానికి తెచ్చిన పత్తిలో తేమశాతం అధికంగా ఉండటంతో కొంతమంది రైతులు తిరిగి ఇంటిని తీసుకెళుతుండగా.. నిల్వ చేసే స్థలం లేనివారు యార్డు లోనే ఆరబెడుతూ రోజుల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి. మరోవైపు మోంథా తుపాను ప్రభావం వారిలో మరింత గుబులు రేపుతోంది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీసీఐ నిబంధనలు సడలించి త్వరగా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### ససేమిరా అంటున్న సీసీఐ

తేమశాతం పేరిట సీసీఐ విధిస్తున్న నిబంధన రైతుల పాలిట శాపంగా మారింది. 12 శాతంలోపు ఉంటేనే సీసీఐ కొనుగోలు చేస్తుంది. అది కూడా 8శాతానికి మాత్రమే కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.8,110 చెల్లిస్తుంది. 9 నుంచి ఒక్కోశా తానికి రూ.81.10 చొప్పున కోత విధిస్తున్నారు. 12శాతం మించితే కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు చేసేది లేక తక్కవ ధరకే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకొని నష్టపోతున్నారు. మరికొంతమంది రైతులు పంటను తిరిగి ఇంటికి తీసుకెలుతున్నారు. ఇంటి వద్ద నిల్వచేసే అవకాశం లేని వారు యార్డులోనే తేమశాతం తగ్గేంతవరకు ఆరబెడుతున్నారు. రోజుల తరబడి అక్కడే పడిగాపులు కాస్తున్నారు. రెండో రోజు రూ.140 తగ్గించిన వ్యాపారులు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండో రోజు అదే పరిస్థితి నెలకొంది. తేమశాతం 12కు మించితే పత్తిని కొనేందుకు సీసీఐ నిరాకరించడంతో ప్రైవేట్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. తొలిరోజు క్వింటాల్‌కు రూ.6,950తో కొనుగోలు చేశారు. మంగళవారం మళ్లీ బహిరంగ మార్కెట్ పేరిట క్వింటాల్‌కు రూ.140 తగ్గించి క్వింటాలు రూ.6,810తో కొనుగోలుచేశారు. మద్దతు ధర రూ.8,110 ఉండగా తొలి రోజున తేమశాతం 13 నుంచి 20 రావడంతో సీసీఐ కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు ఆందోళనకు దిగడంతో కలెక్టర్, ఎమ్మెల్యేలు సర్దిచెప్పడంతో వ్యాపారులు పత్తిని కొనుగోలు చేశారు. మొదటి రోజు కంటే మరుసటి రోజు మరింత ధర తగ్గించడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ ధరకు విక్రయిస్తే తమకు పెట్టుబడులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తేమ శాతం సడలించి కొనుగోలు చేసేలా చూడాలని కోరుతున్నారు. లేకుంటే తాము తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అనుకూలించని వాతావరణం

ఈ ఏడాది పత్తి రైతులపై వరణుడు కన్నెర్ర జేశాడు. అధిక వర్షాలు పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్లు కూడా రాని పరిస్థితి. వచ్చిన కొద్దిపాటి దిగుబడిని సైతం విక్రయించేందదుకు అవస్థలు తప్పడం లేదు. తేమ శాతం నిబంధన వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. సహజంగా తొలి విడతలో వచ్చే పత్తి లో తేమశాతం అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో సీసీఐ మాత్రం నిబంధనల మేరకే కొనుగోలు చేస్తామని చెబుతోంది. దీంతో ఆరబెట్టేందుకు వారి ఇక్కట్లు వర్ణనాతీతంగా మారాయి. తుపాన్ ప్రభావంతో బుధవారం పత్తి కొనుగోళ్లను నిలిపివేసిన అధికారులు స్లాట్ బుకింగ్లను రద్దు చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు. దీంతో 425 బుకింగ్‌లు రద్దయ్యే అవకాశముందని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.



### లారీని ఢీ కొట్టిన కారు

## ముగ్గురికి గాయాలు

**నేరడిగొండ, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం లారీని వెనుక నుంచి కారు ఢీ కొన్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ నుంచి అదిలాబాద్ వైపు వెళుతున్న లారీని బెంగళూరు నుంచి నాగపూర్ వైపు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్న కారు అదుపు తప్పి లారీ వెనుక నుండి బలంగా ఢీకొనడంతో కారు ముందరి భాగం డ్యామేజ్ కావడం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు సుదర్శన్, మధు ,మనీషా స్వల్ప గాయాలతో బయటపడడంతో ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. గాయపడ్డ వారిని వెంటనే హైవే అంబులెన్స్ సిబ్బంది స్వామి, నరేందర్‌లు స్పందించి హుటాహుటిన నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పదో తరగతి విద్యార్థి అదృశ్యం

**ఇచ్చోడ, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

బాలుర గురుకు గిరిజన విద్యార్థి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ప్రిన్సిపాల్ కిషన్ చౌహన్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్నూర్ మండలం మహాగావ్ గ్రామానికి చెందిన జాదవ్ రోహిదాస్ కుమారుడు అనికేత్ (15) బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 06న మధ్యాహ్నం పాఠశాల నుంచి బయటికి వెళ్లినట్టు సీసీ కెమెరాల్లో ఉందని పాఠశాల సిబ్బంది తెలిపారు. తెలుపు ప్యాంట్, నలుపు రంగు షర్ట్ వేసుకొని ఉన్నాడని తండ్రి తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 6309368196, 8523036321 సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై గిరిజన ప్రాజెక్ట్ అధికారి పీవో దృష్టికి కలెక్టర్, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కిషన్ చౌహన్ పేర్కొన్నారు.

### పేలుడు పదార్థాలు

## నిలువ ఉంచిన వ్యక్తికి 6నెలల జైలు

**మంచిర్యాల, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
అనుమతి లేకుండా నిషేధిత పేలుడు పదార్థాలు (జిలెటిన్ స్టిక్స్, ఎలక్ట్రానిక్ డిటోనేటర్స్, నాన్ ఎలక్ట్రానిక్ డిటోనర్స్) నిలువ ఉంచిన వ్యక్తికి జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జి కే. నిరోష మంగళవారం అర్నెల్ల సాధారణ జైలుశిక్ష, రూ. 3వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చినట్లు సీఐ ప్రమోదావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్బీ రోడ్లో బాలాజీ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అజ్మీర నిర్మలరాయ్ హాజీపూర్ మండలంలోని ఘడ్పూర్ గ్రామ శివారులో మందుగుండు సామగ్రి నిలువ ఉంచాడన్న సమాచారం మేరకు 2018లో అప్పటి ఎస్సై మారుతి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. 166 జిలెటిన్స్ స్టిక్స్, 7,250 ఎలక్ట్రానిక్ డిటోనేటర్స్, 774 నాన్ ఎలక్ట్రానిక్ డిటోనేటర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పూర్తి విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

# విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

### ఐటిడిఏ పిఓ యువరాజు మర్మాట్

**ఉట్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొలం గిరిజన ఆశ్రమ బాలురు పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, తరగతిగదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థులకు అవసరమైన ఐరన్, సి విటమిన్ టాబ్లెట్లను అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని





తెలిపారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వసతి గృహ పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. చలికాలం నేపథ్యంలో కప్పుకోవడానికి సాలువలు, స్నానానికి వేడి నీళ్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఆర్వో ప్లాంట్ పనితీరును పరిశీలించారు.ప్రతిరోజు వంటశాల, స్టోర్ రూమ్, త్రాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించి, సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



**మంచిర్యాల, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. హాజీపూర్ మండలం కర్ణమామిడికి చెందిన సల్లం శ్రీనివాస్ (40) అదే గ్రామానికి చెందిన కొట్టె తిరుపతి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం కర్ణమామిడి శివారులోని కొట్టె ప్రసాద్ పొలం వద్ద నుంచి వడ్లు తెచ్చేందుకు శ్రీనివాస్ ట్రాక్టర్ తీసుకెళ్లాడు. ఈక్రమంలో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య లత, కుమార్తెలు అక్షిత, నిహారిక, కుమారుడు శివ ఉన్నారు. సంఘటనా స్థలాన్ని మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. పోలీసులు వారిని సముదాయించి మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

# గ్రామాల్లో పత్తి ఏరడానికి కూలీల కొరత



చేనులోనే పత్తి పంట

కూలీల లేక తంటాలు పడుతున్న రైతులు

స్థానికంగా దొరకని తీరు - ఇతర ప్రాంతాల నుంచి తరలింపు

**కుభీర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఈసారి పత్తి పంట సాగు చేసిన రైతులకు కష్టాలు తప్పేటట్లు లేవు. పంటకు తెగుళ్లు, పెరిగిన పెట్టుబడి ఖర్చులు, వాతావరణ పరిస్థితులు ఇలా అనేక ఒడిదుడులతో పత్తి పంటను సాగు చేస్తే ఆశించిన దిగుబడులు రావడం లేదు. ధరలు తగ్గుముఖం పడతుండడంతో వీలైనంత త్వరగా పత్తిని సేకరించి అమ్ముకోవాలని అనుకుంటున్నా కూలీల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూ పంటను తీయిస్తున్నారు. సోయా, పత్తి పంట సీజన్‌లో ఒకేసారి చేతికి రావడంతో సాగుదారులు వ్యవసాయ కూలీల కోసం కళ్లల్లో వొత్తులేసుకుని వెతుకులాడుతున్నారు. కుభీర్ మండలం మహారాష్ట్రకు సరిహద్దులో ఉంది. సోయ పంట కోతకు, పత్తి తీయడానికి, మహారాష్ట్ర కూలీల పైనే ఆధార పడాల్సిన పరిస్థితి. వర్షాల కారణంగా సోయ పంట కోతలు ఆలస్యం అయింది. ప్రస్తుతం మహారాష్ట్ర కూలీలు ఒక టీం గా ఏర్పడి ప్రత్యేక వాహనాల్లో, ఆటోల్లోను వచ్చి సోయ కోతకు ఒక బ్యాగ్‌కు 3500 నుంచి 4000 వాళ్ళు వచ్చిన వెహికల్ కిరాయిని సైతం తీసుకుంటున్నారు. దీంతో ఒక్కో కూలి రోజుకు 700, 800 సంపాదిస్తున్నారు. పత్తి పంట పగలడంతో కిలో పత్తికి ఇస్తామన్నా దొరకని పరిస్థితి నెలకొంది. పత్తితీత కూలీలకు గిట్టుబాటు కాకపోవడంతో సోయ కోయడానికే ఆసక్తి చూపుతున్నారు. పత్తి తీయడం ఆలస్యం కావడం దూది నాణ్యత తగ్గుతుందని, తేమ శాతం తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### అధిక ఫీజు వసూలు చేస్తున్న

## పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**బోథ్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
బోథ్ పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు పదో తరగతి విద్యార్థుల నుండి పరీక్ష ఫీజు పేరిట అధిక ఫీజును వసూలు చేస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇవాళ బోథ్ ఎంఈవో హుస్సేన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం రూ. 125 నిర్ణయించగా కొన్ని పాఠశాలలు రూ.700 నుండి రూ.1000 వరకు వసూలు చేస్తున్నాయన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మున్సిఫ్, నరేష్, కార్తీక్ పాల్గొన్నారు.

### అసభ్యంగా ప్రవర్తించిన

## ఉపాధ్యాయుడి సస్పెండ్

**నెన్నెల, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గుండ్లసోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు షేక్ ఖాదర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. హెచ్ఎం బానేష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ డీఈవో యాదయ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. షేక్ ఖాదర్ డిప్యూటేషన్‌పై రెండేళ్ల క్రితం చిత్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి గుండ్లసోమారం ఉన్నత పాఠశాలకు వచ్చారు. ఖాదర్ తరగతి గదిలో బాలికల పక్కన కూర్చోవడం, పైన చేతులు వేయడం లాంటి వెకిలి చేష్టలకు పాల్పడుతున్నాడని విద్యార్థినుల తల్లిదండ్రులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, మందమర్రి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మశ్రీ, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ సౌజన్య, ప్రొటక్షన్ ఆఫీసర్ సత్తయ్య విచారణ చేపట్టారు. విద్యార్థినులు, తల్లిదండ్రుల నుంచి సమాచారం తీసుకున్నారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా టీచర్, హెచ్ఎంలపై శాఖపరమైన చర్యలు తీసుకున్నారు.

## డివైడర్‌ను ఢీకొన్న డీసీఎం

**సోన్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
నాగపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం మంగళవారం జాతీయ రహదారి-44పై కడ్తాల్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టింది. రహదారిపై సుమారు 30 మీటర్లు దూసుకెళ్లి డివైడర్‌పై ఆగింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

# విద్యార్థులు మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులంతా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని మార్గదర్శ కంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం చించోలి (బి) సమీపంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్‌కు విద్యార్థులు పుష్పగుచ్ఛం అందజేసి, బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర సమరయోధులలో ముందువరుసలో నిలిచి, దేశ స్వాతంత్రం కోసం ప్రాణం పణంగా పెట్టారని పేర్కొన్నారు. ఆయన జయంతిని మైనారిటీ సంక్షేమ దినోత్స వంగా కూడా జరుపుకుంటామని తెలిపారు. స్వాతంత్రం అనంతరం భారత తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. విద్య కొద్దిమందికి మాత్రమే అందుబాటులో ఉన్న కాలంలో మౌలానా ఆజాద్ దేశంలో విద్యా వ్యాప్తి, సమాన అవకాశాల కోసం నిరంతర కృషి చేశారని కలెక్టర్ వివరించారు. మైనార్టీ వర్గాల ఉన్నతికి, సమాజ సమగ్రాభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. విద్యార్థులు ఆయన గొప్పతనాన్ని తెలుసుకొని ఆదర్శంగా తీసుకోవాలని, ముఖ్యంగా బాలికలు విద్యను మధ్యలో ఆపివేయకుండా, మంచి ఉద్యోగాలను సాధించి సమసమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు కల్పించిందని, వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు బాలికల విద్యాభివృద్ధికి విస్తృత ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, తొలి విద్యాశాఖ మంత్రి అయిన ఆయన జీవితకాలం ప్రతి ఒక్కరికి విద్య అనే లక్ష్య సాధనకు కృషి చేశారని తెలిపారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మైనార్టీ శాఖ ఉద్యోగులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై ఉపన్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, తహసిల్దార్ రాజు, కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్స్ రహత్ నాజ్నిమ్, సుజాతా రాథోడ్, ఇతర అధికారులు, మైనార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించిన పీడీ

**బెల్లంపల్లి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
పట్టణంలో పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కొంత మంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు వార్తలు రావడంతో మంగళవారం ఇందిరమ్మ పథకం పీడీ బన్సీలాల్ నాయక్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఎంపికైన లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అర్హులకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పీడీ బన్సీలాల్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు స్వామి, బండి ప్రభాకర్, ఎండి అనీఫ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటస్వామిలు ఉన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**బెల్లంపల్లి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఈనెల 15న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్విని యోగం చేసుకోవాలని బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని, తమ వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో, ఇరు పక్షాల అంగీకారంతో పరిష్కరించబడతాయన్నారు.

## కొత్త పింఛన్లు ఇంకెప్పుడు మహాప్రభో

**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వృద్ధులకు, మహిళలకు, బీడీ కార్మికులకు పెంచుతామన్న పెన్షన్ ఎప్పటి నుంచి అమలు చేస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ ప్రశ్నించారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో పింఛన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న వైఖరికి నిరసనగా ఆర్డీఓ కార్యాలయం ముందు వృద్ధులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాల ని, పెన్షన్లు 4000 పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ రత్న కళ్యాణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్, పార్టీ నాయకులు రామ గౌడ్, వినోద్, శ్రీనివాస్, సాదిక్ తదితరులున్నారు.



# పసుపు పరిశోధన కేంద్రం సందర్శన



**లోకేశ్వరం, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడ్ జిల్లా భవానీ సాగర్ పసుపు పరిశోధన కేంద్రాన్ని మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులు సందర్శించారు. జాతీయ పసుపు బోర్డు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సందర్శనకు వెళ్లారు. పసుపు సాగు రకాలు, యాజమాన్య పద్ధతులు, దిగుబడులు, అంతర పంట లు, విత్తనశుద్ధిపై అభ్యాసన చేశారు. భవానీ సాగర్ పసుపు పరిశోధన సంస్థ సాగు చేస్తున్న బీఎస్ఆర్-2, బీఎస్ఆర్-3 పసుపు వంగడాలకు సంబంధించిన యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్త కవిత వివరించారు. వెళ్లిన వారిలో కొరటికల్ పసుపు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ చైర్మన్ భీమా రెడ్డి, వైస్ చైర్మన్ రాజారెడ్డి, డైరెక్టర్ నరేష్, ముఖ్య కార్య నిర్వహణ అధికారి సుమన్ కుమార్, ఆదిలాబాద్ ఫార్మర్ ప్రొ డ్యూసర్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ గంగాప్రసాద్ పాల్గొన్నారు.

# నిర్మల్ వాసికి ప్రతిష్టాత్మక పురస్కారం

**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఉర్దూ భాష, ఉర్దూ సాహిత్యాభివృద్ధికి చేస్తున్న సేవలకుగానూ జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ జలీల్ ఆజర్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ప్రతిష్టా త్మక పురస్కారం అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చేతుల మీదుగా 'మహబూబ్ హుస్సేన్ జిగర్' పురస్కారం అందుకు న్నారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, మైనారిటీ నాయకులు అనీస్ ఖాన్, జిషాన్ అలీ, తదితరులు అభినందనలు తెలిపారు.

# వెంకటాపూర్ చెరువు వద్ద మొసలి కలకలం

**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ చెరువు వద్ద మంగళవారం మొసలి కలకలం రేపింది. ఒడ్డుకు వచ్చి మళ్లీ చెరువులోకి వెళ్తుండగా పలువురికి తారసపడింది. దీంతో కొందరు తమ ఫోన్‌లో ఈ దృశ్యాన్ని బంధించారు. ఈ వీడియో సోషల్ మీడి యాలో వైరల్ కాగా చుట్టు పక్కల వారు, మత్స్యకారులు భయాందోళనకు గురయ్యారు. అటవీశాఖ అధికారులు స్పందించి మొసలిని పట్టుకోవాలని కోరారు.



# నీల్వాయి రేంజర్‌గా సదానందం

**వేమనపల్లి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
నీల్వాయి అటవీ రేంజర్ కోటపల్లి రేంజర్‌గా సదానందం అదనపు బాధ్యత స్వీకరించారు. నీల్వాయి అట వీ రేంజర్ హఫీజుద్దీన్ నెలరోజుల వైల్డ్ లైఫ్ శిక్షణ తరగతులకు వెళ్లారు. కోటపల్లి రేంజ్‌తో పాటు గత కొన్ని నెలలుగా సదానందం చెన్నూరు రేంజ్ అదనపు బాధ్యతలు నెరవేర్చారు. ఇటీవల డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్‌కు చెన్నూర్ బాధ్యతలు అప్పగించగా.. సదానందంకు బాధ్యతలు అప్పగించారు.





## అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

**బెల్లంపల్లి, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణా లను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఎమ్మార్వో కృష్ణ ఆధ్వర్యంలో జేసీబీతో సిబ్బంది నేల మట్టం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

## డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు

**ఉట్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంపార్టికస్ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 277 మంది హాజరుకాగా, 15 మంది ఎంపికైనట్లు కంపెనీ హెచ్ఆర్ వినయ్ తెలిపారు. ఎంపికైన వారికి రూ.20 వేలకుపైగా జీతం ఉంటుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిప్రసాద్, టీఎస్‌కేసీ కో-ఆర్డినేటర్ ఎస్ కె ముజీబ్, డాక్టర్ నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ పోతే ఆందోళన వద్దు

**నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**
మొబైల్ ఫోన్ పోతే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పలువురు రూ.8.52లక్షల విలువైన 71 సెల్‌ఫోన్‌లు పోగొట్టుకోగా సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి మం గళవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాల యంలో బాధితులకు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో ప్రవేశపెట్టిన సీఈఐఆర్ ద్వారా పోయిన సెల్‌ఫోన్‌లను గుర్తించి స్వా ధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1, 806 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.






# పొద్దు పొడుపు.. బొజ్జన్న అడుగు

### ఆప్యాయంగా పలుకరించి.. సమస్యలు తెలుసుకొంటూ ముందడుగు
### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మార్నింగ్ వాక్

**ఉట్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా మంగళవారం పొద్దు పొడువక ముందే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఉట్నూర్ పట్టణంలో మార్నింగ్ వాక్ చేస్తూ గల్లీ గల్లీ తిరిగారు. ప్రజలను ఆప్యాయంగా పలుకరించి.. సమస్యలు తెలుసుకొంటూ ముందడుగు వేశారు. ఎమ్మెల్యే తమ గడప వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకోవడం చూసి గల్లీ వాసులు మురిసి పోయారు.ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గత కొంత కాలంగా 'పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పొద్దు పొడవక ముందే మార్నింగ్ వాక్ చేస్తు ప్రజల సమస్యలు విని వెంటనే పరిష్కరిస్తున్నారు. మంగళవారం మార్నింగ్ వాక్‌లో సుభాష్ నగర్, సేవదాస్ నగర్, పోచమ్మ గల్లి, ఫకీర్ గుట్ట, మెయిన్ రోడ్‌లలో పర్యటించారు. ప్రజలతో ముచ్చటిస్తూ, వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్య ఉన్న చోట వెంట ఉన్న అధికారులను సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇల్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. డ్రైనేజీ సమస్యకు పరిష్కారం దిశగా ప్రణాళిక చేశారు. అవసరం ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్, నూతన వాటర్ ట్యాంక్స్, ఐబీ ప్రాంతంలో సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణకు స్థలం పరిశీలించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. మెస్, వసతి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.




# శిక్షణ నైపుణ్యాలతో ఆరోగ్య రంగ అభివృద్ధికి కృషి చేయాలి

### ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్




**ఉట్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ఆరోగ్య రంగా అభివృద్ధికి వినియోగించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, కేర్ విద్యా అకాడమీ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అసిస్టెంట్ నర్స్ కోర్స్ సెంటర్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ శిక్షణలో అందిస్తున్న అంశాలను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, శిక్షణకు నిబద్ధతతో హాజరై నేర్చుకున్న అంశాలను వినియోగించి ఆరోగ్య రంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం వైద్యరంగంలో విశిష్ట మైన మార్పులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. యువతకు శిక్షణ సామగ్రిని అందజేశారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఉట్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

మండలం షాంపూర్‌లోని ప్రజా మిత్ర దాల్ మిల్ వద్ద మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రతి గింజను, అన్ని రకాల పంటను రైతుల నుండి మద్దతు ధరకు ప్రజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మండలంలోని దంతనపల్లి గ్రామం లో ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.






# ఫాస్టాగ్ చెక్‌పోస్ట్‌పై భగ్గుమన్న ఎమ్మెల్యే

### కొత్తగూడ చెక్ పోస్ట్ వద్ద అటవీ శాఖ అధికారుల నిలదీత
### తనకు తెలియకుండా ఎలా ప్రారంభిస్తారని ఆగ్రహం
### 24 గంటల్లో ఫాస్ట్యాగ్ బంద్ చేయాలని ఆదేశం
### లోకల్ వాహనాలకు డబ్బులు వసూలు చేస్తే ఊరుకొనేది లేదు
### లోకల్ వాహనాల డాటా సేకరించిన తరువాతనే
### ఫాస్ట్యాగ్‌పై నిర్ణయం తీసుకోవాలని సూచన
### అటవీ శాఖ తీరును తప్పు పట్టిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, నవంబర్ 11 (ప్రభాత సమాచారం)**

కవ్వాల టైగర్ జోన్ పరిధిలోని చెక్ పోస్టుల వద్ద రాకపోకలు సాగించే వాహనాల నుంచి రుసుం వసూలు చేసేందుకు ఏర్పాటు చేసిన ఫాస్ట్యాగ్ కేంద్రాలపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ భగ్గు మన్నారు. అటవీ శాఖ తీరును తప్పుబట్టారు. తన అనుమతి లేకుండా ఫాస్ట్యాగ్ ఎలా ప్రారంభిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో ఫాస్టాగ్ బంద్ చేయాలని ఆదేశించారు. కొత్తగూడ ఫారెస్ట్ చెక్ వద్ద లోకల్ వాహనాలకు కూడ రుసుం వసూలు చేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకోరావడం తో మంగళవారం రాత్రి అయన ఉట్నూర్ కు సమీపంలోని కొత్తగూడ చెక్ పోస్ట్ వద్దకు వెళ్లారు. రుసుం వసూలు చేసేందుకు ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఉన్నతధికారులతో ఫోన్‌లో మాట్లాడి అధికారుల తీరును తప్పుబట్టారు. లోకల్ ఎమ్మెల్యేగా, వన్యప్రాణి సంరక్షణ సలహా మండలి సభ్యుడిగా ఉన్న తనను సంప్రదించకుండానే ఫాస్ట్‌ట్యాగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి స్థానిక వాహనాల నుంచి రుసుం ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు. ఖానాపూర్ నియోజకవర్గం మొత్తం టైగర్ జోన్ పరిధిలో విస్తరించి ఉందని నియోజకవర్గ పరిధిలోలో ఉన్న లైట్ వెహికల్, హెవీ వెహికిల్‌లకు రుసుం నుంచి మినహాయించాలని సూచించారు. లోకల్ వాహనాల డాటా సేకరించి వాటికి రుసుం మినాహించిన తరువాతనే నిర్ణయం తీసుకోవాలన్నారు. అటవీశాఖపై తనకు గౌరవం ఉందన్నారు. ఇల్లీగల్‌గా ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్యాగ్ కేంద్రాలను వెంటనే మూసివేసి ఉన్నత స్థాయిలో జరిగే నిర్ణయం తరువాతనే ముందుకు వెళ్లాలని సూచించారు.